


ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..?

- బురదమయంగా మట్టి రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

8



గజ్వేల్‌కు చెందిన ఓ వడ్డీ వ్యాపారి దాదాపుగా కోటి రూపాయలు రోజువారీ వడ్డీ కింద ఇచ్చే వారు. ఇలా ఇచ్చే వడ్డీవ్యాపారిని నమ్మి పలువురు ఉద్యోగులు, సామాన్య ప్రజలు దాదాపుగా రూ. 2.5 కోట్ల మేర సగటు ఆ వ్యాపారికి ఇచ్చారు. ఈ క్రమంలో అంతా సాఫీగా సాగిన అతడి వ్యాపారం ఏమైందో తెలియదు కానీ రాత్రికి రాత్రే ఊరు విడిచి కుటుంబంతో సహా వెళ్లిపోయాడు. దీంతో ఆయనకు డబ్బులు ఇచ్చిన పలువురు అక్కడ ఇక్కడ వెతికివెతికి విసుగుచెందారు. వడ్డీ వ్యాపారికి డబ్బు ఇచ్చిన వారిలో దాదాపుగా అంతా సామాన్య, మధ్య తరగతి ప్రజలే. ప్రస్తుతం వారంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఇక మరో వ్యాపారిని నమ్మి దాదాపు రూ.50లక్షలు వడ్డీకి ఇచ్చిన మరో వ్యక్తికి ఊహించని షాక్ తగిలింది. తెల్లారేసరికి వ్యాపారి ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో తాను రూపాయి రూపాయి కూడబెట్టుకుని వడ్డీకి ఇచ్చి అదే వడ్డీతో జీవనాన్ని సాగిస్తున్న వ్యక్తి ఒక్కసారిగా రోడ్డు మీదకు వచ్చాడు. చేతిలో చిల్లిగవ్వ లేక, నెల నెలా వచ్చే వడ్డీ ఆగిపోవడంతో ప్రస్తుతం సదరు వ్యక్తి కూలీ పని చేస్తూ కుటుంబాన్ని ముందుకు సాగిస్తున్నాడు.

పల్లె, పట్నం తేడా లేదు.. ఎక్కడా అప్పు పుట్టడం లేదు. చేబదులూ అనే ముచ్చటే లేదు. అవసరానికి డబ్బు సర్దుబాటు కాని పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల ఇబ్బందులు వర్ణనాతీతం. ఎవరిని కదిలించినా డబ్బు సమస్యే. ప్రజల్లో ఆర్థిక అనిశ్చితి కనిపిస్తుంది. గతంలో డబ్బు అవసరం ఉందంటే ఎవరో ఒకరు సర్దుబాటు చేసేవారు. బంధువులు, స్నేహితులు చేబదులు ఇచ్చేవారు లేదంటే అప్పు అయినా పుట్టేది. వాటితో అవసరాలు తీర్చుకొని, డబ్బులు సర్దుబాటు కాగానే తిరిగి చెల్లించేవారు. ఇక ఫైనాన్స్, వడ్డీ వ్యాపారులు, నమ్మకం ఉన్నవారికి అప్పులు ఇచ్చేవారు. అయితే ఇచ్చిన అప్పులు తిరిగి తీసుకునేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. దీనికితోడు స్థిరాస్థి మార్కెట్ లేకపోవడం, అప్పు తిరిగి చెల్లించేందుకు జాప్యం నెలకొనడంతో అప్పు పుట్టడం లేదు. పలువురు మోసగాళ్లు లక్షల్లో.. కోట్లల్లో అప్పులు చేసి కుచ్చుటోపీ పెడుతుండడంతో నిజాయితీపరులకు సైతం అవసరం ఉన్నప్పుడు అప్పు పుట్టని పరిస్థితి నెలకొన్నది.

- గజ్వేల్, మే 27 (ఆంధ్రజ్యోతి)

అప్పు పుట్టట్లే..!

- ప్రజల్లో ఆర్థిక అనిశ్చితి.. ● మిత్తికి డబ్బులివట్లే
- చేబదుళ్లకు చెల్లు
- పలువురి మోసాలతో ఇబ్బందులు
- కోట్లాది రూపాయలు స్వాహా చేసిన మోసగాళ్లు
- నిలిచిన భూ క్రయ విక్రయాలు
- అత్యవసరం అయితే అవస్థలే
- కాంట్రాక్టర్లకూ బిల్లులు రాక కటకట..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అప్పు తీసుకున్న వారు సకాలంలో చెల్లించకపోవడంతో గజ్వేల్‌లో వడ్డీ వ్యాపారం పూర్తిగా చతికిలపడింది. వడ్డీ వ్యాపారానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేక పోవడం, డబ్బు కోసం నిలదీసే పరిస్థితి లేకపోవడంతో వడ్డీ వ్యాపారులు ఎక్కువ శాతం దెబ్బతిన్నారు. పోలీసులు అప్పు ఇచ్చిన వారిని ఇబ్బందులకు గురిచేసిన ఘటనలతో వడ్డీ వ్యాపారులు ఆ వ్యాపారాలను వదిలేశారు. ఇచ్చిన డబ్బు రాక వడ్డీ వ్యాపారులు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో వడ్డీ వ్యాపారం పరిస్థితి కూడా అధ్వాన్న స్థితికి చేరింది. దీంతో కొందరి తీరు నిజాయితీ పరులకు కూడా అప్పుపుట్టని పరిస్థితి. అప్పు ఇచ్చి, పుచ్చుకునే సమయంలో మధ్యవర్తులుగా ఉన్న వారి పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇద్దరి మధ్య నలిగిపోతున్నారు. అవసరం మేరకు తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో స్నేహితులు, బంధువుల మధ్య గొడవలు దారితీస్తున్నాయి. అవికాస్తా బంధాలు తెగిపోయేలా చేస్తున్నాయి.

అప్పులు చేసి పరారీ

నమ్మించి మోసం చేస్తున్న పలువురి తీరుతో సామాన్యులకు అప్పు పుట్టని పరిస్థితులు దాపురించాయి. నిజాయితీగా కడదామన్నా, అత్యవసరమైనా అప్పు పుట్టడం లేదు. గజ్వేల్ పరిధిలో ఇప్పటికి దాదాపుగా పది మందికి పైగా నమ్మించి రూ.కోట్లు అప్పుల తీసుకోవడం, తాకట్టు పెట్టుకుని డబ్బులు ఇవ్వడం, ఎక్కువ వడ్డీలిస్తామని డబ్బులు తీసుకుని ఆ తర్వాత ఉడాయించారు. ఇలాంటి ఘటనలు అప్పు ఇస్తే తిరిగి రావని, ఇక నుంచి అప్పులు ఎవరికీ ఇవ్వవద్దని చాలామంది నిర్ణయానికొస్తున్నారు. దీంతో అప్పు పుట్టకుండా పోతోంది. గజ్వేల్ పట్టణంలో గతంలో ఫైనాన్స్‌ల పేరిట నలుగురు ఉడాయించగా, ఓ కార్పోరేట్ సంస్థ పేరిట అధిక వడ్డీలు ఆశ చూపి పెట్టుబడులు పెట్టించుకుని ఉడాయించిన వారు మరికొందరు. ఇక ఇటీవల ఈజీ మనీ కోసం అప్పులు చేసి పరారవుతున్న వారు ఇంకొందరు. ఇలా అనేక మంది అప్పులు చేసి పారిపోతుండడంతో నిజాయితీ పరులకు అప్పు పుట్టడం ఇబ్బందిగా మారుతుంది.

కాంట్రాక్టర్ల జేబులు ఖాళీ

ప్రభుత్వ పనులు చేసి డబ్బు సంపాదించాలనుకున్న నాయకులు కొందరు, సర్పంచ్, ఎంపీటీసీలు చేయకూడని అప్పులు చేసి అభివృద్ధి పనులు పూర్తిచేశారు. పనులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా బిల్లు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగి కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో తాజా మాజీ ప్రజాప్రతినిధుల్లో సర్పంచులు ఎక్కువ మంది రూ.20లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. ఒకప్పుడు మాటమీద డబ్బులు వడ్డీకి ఇచ్చేవారు. బాండ్ పేపరో, ఇతరత్రా కాగితాల మీదనే నమ్మకంతో వడ్డీ వ్యాపారం కొనసాగేది. ఇప్పుడు మార్కెట్ పరిస్థితులు, కొందరు తీరు సరిగా లేకపోవడంతో వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అప్పు ఇవ్వాలంటే ప్లాట్, భూములు, బంగారం తాకట్టు పెడితే గాని అప్పు పుట్టడం లేదు. అప్పు ఇచ్చే వారి పేరు మీద భూమి, ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయించడం, బ్యాంకుల్లో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టడం ద్వారానో అప్పులు తీసుకుంటున్నారు. తాకట్టు లేనిదే అప్పు దొరకని పరిస్థితి ఏర్పడింది. గజ్వేల్ పరిధిలో బ్యాంకుల్లో ప్రతి రోజూ గోల్డ్ లోన్ల పేరిట కనీసం యాభై మంది వరకు అప్పులు తీసుకుంటున్నారు. ఇక రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఆయా ఫైనాన్స్‌లు నెలకు కనీసం వంద వరకు మార్టిగేజ్ రుణాలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

మిగతా 8లో..



కమ్ముకున్న కారు మబ్బులు

అప్పటి వరకు నిర్మలంగా ఉన్న ఆకాశంలో ఒక్కసారిగా కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఆ కారుమబ్బులను చూస్తుంటే భూమిని ఒక దుప్పటిలాగా కప్పుతున్నట్లుగా అనుభూతి కలుగుతుంది. ఈ అద్భుతమైన దృశ్యం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ వద్ద మంగళవారం సాయంత్రం ఆకాశంలో ఆవిష్కృతమైంది.

- చిన్నకోడూరు, మే 27 (ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 27 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం తప్పదని, అందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ 50 మంది పద్మశాలీ మహిళలకు రూ. 5 లక్షల విలువ కలిగిన 50 కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేసి మాట్లాడారు. పద్మశాలీ మహిళలు ఆర్థికంగా ఉన్నతస్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పద్మశాలీలు, చేనేత కార్మికులకు రుణమాఫీ చేశామని తెలిపారు. అనంతరం మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగి పోయారన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సమాజం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కస్తూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను అందజేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

శునకం దాడిలో 10 మందికి గాయాలు

- గాయపడ్డ వారిలో 16 నెలల చిన్నారి

సిద్దిపేట క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి) : వీధి కుక్క దాడిలో 10 మందికి గాయాలైన సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేటలోని ఓ కుక్క మొదట శ్రీనివాస్‌నగర్‌లో ఇద్దరు వ్యక్తులపై, అక్కడి నుంచి అంబేడ్కర్ నగర్‌లో ఇద్దరిపై, శంకర్‌నగర్‌లో 16 నెలల చిన్నారి సంగీతతో పాటు మరో ఇద్దరిపై, నర్సాపూర్ చౌరస్తాలో ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచింది.



గాయపడిన చిన్నారి సంగీత

బాధితులందరూ సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. స్థానికులు మున్సిపాలిటీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో కుక్కను పట్టుకోవడానికి ప్రయత్నించినప్పటికీ పారిపోయింది. ఒకే కుక్క పది మందిపై దాడి చేయడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు.



చేనుకు చేవ.. వేప

- చీడపీడల నివారణకు దోహదం..
- వేప పిండి, నూనె అన్ని ఎరువులే
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు..

7

జీవాల ఎరువుతో జీవం

- భూసారం పెంపునకు దోహదం

7

చదువుల సరస్వతులు

రేవతి, నవ్య

- పరీక్ష ఏదైనా ఫస్ట్, సెకండ్ స్థానాలు వీళ్లవే
- పోటీ పరీక్షల్లో రాణిస్తున్న వీరారెడ్డిపల్లి అమ్మాయిలు

7

వరకట్న వేధింపులకు

వివాహిత బలి

6

చెరువుకు చేరని చేప

- ముంచుకొస్తున్న రుతుపవనాలు
- రోహిణి కార్తె మొదలు
- ఇప్పటికీ టెండర్ల ఊసే లేదు
- సమయం దాటితే ప్రయోజనం శూన్యం
- గతేడాది టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఆందోళనలో మత్స్యకారులు



దుబ్బాక, మే27(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయి. రోహిణికార్తెలోనే చేపపిల్లల పంపిణీకి చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఇప్పటికీ టెండర్లపై స్పష్టత రాలేదు. గతేడాది టెండర్లకే కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఈసారి ఏంటో అని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 516 మత్స్యకార సొసైటీలున్నాయి. సుమారు 36వేల మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నప్పటికీ పరోక్షంగా 1.50 లక్షల మంది మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు. జిల్లాలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్ ప్రాజెక్టులతో పాటు సుమారు 1715 చెరువులున్నాయి. జిల్లాలో మత్స్యసంపదను పెంచాలనే లక్ష్యంతో మూడేళ్లక్రితం సుమారు 4.50కోట్ల విత్తనాలను మొదటి విడతలో పంపిణీ చేశారు. జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తికావడంతో పాటు చెరువుల్లో నీటిని నింపడంతో రెండోసారి సుమారు 6 కోట్ల పైచిలుకు చేపపిల్లల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ప్రభుత్వం మారడంతో లక్ష్యం తగ్గింది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

మూడేళ్లక్రితం వేసిన చేపపిల్లల విత్తనాలకు టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బిల్లులు రాలేదు. కరీంనగర్, వరంగల్, నల్గొండ, నిజామాబాద్ జిల్లాలో చేపవిత్తన ఫాంలు ఉన్నాయి. టెండర్లలో పాల్గొనేందుకు ఆంధ్రాలోని కైకలూరు, భీమవరం, రాజమండ్రి నుంచి కాంట్రాక్టర్‌లు విత్తనాలను తీసుకుని వస్తారు. గతేడాది వారంతా ముందుకు రాలేదు. జిల్లాలో ఒకే ఒక్క సంస్థ ముందుకు వచ్చింది. లక్ష్మీనరసింహా ఫిష్‌సీడ్ సంస్థ టెండర్ పొందినా పూర్తిస్థాయిలో చేపపిల్లలను పంపిణీ చేయకుండానే చేతులెత్తేసింది. ఆలస్యంగా టెండర్ లభించడంతో విత్తనాలు లేవని తేల్చిచెప్పింది. కేవలం 6 లక్షల చేపపిల్లలను పంపిణీ చేసి జారుకుంది. సకాలంలో విత్తనాల టెండర్‌లు పిలవకపోవడంతో సూర్య అయ్యప్ప సంస్థ కూడా 6 లక్షలకు మించి విత్తనాలను సరఫరా చేయలేకపోయింది. సుమారు మూడు సార్లు టెండర్లు పిలిచినా కూడా గతేడాది ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఈ ఏడాది ఎలా అని మత్స్యకారులు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

అదునుదాటితే అవస్థలే..

రోహిణి కార్తెలో చేపపిల్లల విత్తనాలను సిద్ధం చేయాల్సి ఉంటుంది. జూన్ వరకు టెండర్ల ప్రక్రియ పూర్తయి జూలై మొదటివారంలోనే చేపపిల్లలు చెరువులో వేయాలి. మార్చి వరకు చేప ఎదగడం వల్ల మత్స్యకారులకు లాభం చేకూరుతుంది. చేపల పంపిణీ పూర్తి ప్రక్రియ కనీసం అక్టోబరు మొదటివారం వరకు పూర్తి చేస్తే, మార్చి వరకు కిలో పెరిగే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం డిసెంబరు వరకు కూడా చేపపిల్లలను చెరువుకు చేర్చలేదు. ఆ తర్వాత కాంగ్రెస్ పూర్తిగా చేతులేత్తేసింది. అదును దాటితే, చేప విత్తనాలు వేసినా కూడా ప్రయోజనం ఉండదు.

కొర్రమీనుకు ప్రోత్సాహం కరువు

తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా ఇష్టపడే కొర్రమీనుకు ప్రోత్సాహం కరువైంది. చేపల విత్తనాలను పంపిణీ చేస్తున్నప్పటికీ బాగా డిమాండ్ ఉండే కొర్రమీను, గురిజ, ఇంగిలికం, జెల్ల, బంగారుతీగ, గ్యాస్‌కట్ లాంటి చేపలను ఇప్పటివరకు ప్రభుత్వాలు సరఫరా చేయలేదు.

ఈసారైనా ప్రభుత్వం త్వరగా స్పందించాలి



అదును దాటితే చేపవిత్తనాలు వేసినా ప్రయోజనం ఉండదు. రెండేళ్లుగా మత్స్యకారులను ప్రభుత్వం ఊరించి, చివరికి చేతులెత్తేసింది. కాంట్రాక్టర్లకు టెండర్ విధానం కూడా సరిగ్గా లేదు. రాజకీయ జోక్యంతో వారు ముందుకు రావడంలేదు. పారదర్శకంగా సొసైటీలకే విత్తనాల సేకరణ బాధ్యత అప్పగించాలి. మత్స్యకారులకే నిధులను నేరుగా అందించే ప్రయత్నం చేయాలి. స్థానిక వాతావరణంలో ఎలాంటి చేపపిల్లలను చెరువులో వేస్తే, మత్స్యకారులకు ఉపయోగం ఉంటుందో..? అదే చేపవిత్తనాలను బయటినుంచైనా తెచ్చుకుంటాం. దీనిద్వారా అవినీతికి తావు ఉండదు.

- గుండబోయిన వెంకటేశ్వర్
- డీసీఎంఎస్ డైరెక్టర్ ఉమ్మడి మెదక్ జిల్లా, జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



సింగాటంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కొనుగోలు ప్రక్రియను

వేగవంతం చేయాలి

- తేమశాతం రాగానే లోడింగ్ చేయాలి
- కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్, మే 27 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. గజ్వేల్ మండలం సింగాటం, కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వర్షాల బారిన పడకుండా టార్పాలిన్ షీట్లు ఎక్కువ మొత్తంలో అందుబాటులో ఉంచుకోవాలని, మిగిలిన ధాన్యాన్ని సైతం తేమశాతం రాగానే వెంటనే లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో 9 వేల క్వింటాళ్లు, సింగాటంలో 12,342 క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో జాప్యం వహించొద్దని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్, అడిషనల్ డీఆర్‌డీవో మధుసూదన్, తహసీల్దార్లు శ్రావణ్‌కుమార్, సుజాత తదితరులున్నారు.

సందడిగా 'స్పిక్ మైకే' సదస్సు

కంది, మే 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో మంగళవారం 'స్పిక్ మైకే' అంతర్జాతీయ సదస్సు రెండోరోజు కొనసాగింది. భారతీయ శాస్త్రీయ కళలలో అత్యుత్తమమైన వాటిలో విద్యార్థులను ముంచెత్తే అనుభవాన్ని ఈ వేడుక పరిచయం చేసింది. మంగళవారం నాడు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి హఠ యోగ, నాద్ యోగా, ధ్యానం శ్రమదాన్, ఇంటెన్సివ్ వర్క్‌షాప్‌లు జరిగాయి. మధ్యాహ్నం యోగ నిద్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఆడిటోరియంలో పళ్లెంపై నృత్యకారిణి చేసిన ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన అబ్బురపరిచింది.

ఎండు గంజాయి పట్టివేత... ఒకరి అరెస్టు

నారాయణఖేడ్, మే 27(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణంలోని బసవేశ్వర చౌక్ సమీపంలోఎండు గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం ఎస్ఐలు హన్మంతు, అనుదీప్ మంగళవారం నారాయణఖేడ్‌లో వివరాలను వెల్లడించారు. ఈ మేరకు.. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రాత్రి ఖేడ్ పట్టణంలోని బసవేశ్వర చౌక్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో నాగల్‌గిద్దకు చెందిన శివకుమార్(35) బైక్‌పై బీదర్ నుంచి వస్తుండగా తనిఖీ చేయడంతో, అతడి వద్ద రెండు సంచుల్లో రెండున్నర కిలోల ఎండు గంజాయి లభించింది. అతడిని అరెస్టు చేసి, బైక్‌ను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు నిమిత్తం ఖేడ్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో స్వాధీనం చేసినట్లు తెలిపారు.

రెండేళ్ల కూతురితో వివాహిత అదృశ్యం


అదృశ్యమైన మమత, కూతురు

శివ్వంపేట్, మే 27(ఆంధ్రజ్యోతి): అత్తగారింటికి వెళ్తున్నట్టు తల్లిగారింట్లో చెప్పి 6 రోజుల క్రితం వెళ్లిన వివాహిత రెండేళ్ల కూతురుతో పాటు అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలోని శభాష్‌పల్లి గ్రామంలో మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన కోట్ల రాజు చిన్న కూతురు బంటు మమత(24) పదిహేను రోజుల క్రితం శభాష్‌పల్లి తల్లిగారి ఇంటికి వచ్చింది. ఈ నెల 21న మధ్యాహ్నం 3 గంటలకు అత్తగారిల్లు అయిన రాయపోల్ మండలం వడ్డేపల్లికి వెళ్తున్నానని చెప్పి రెండేళ్ల కూతురును తీసుకొని వెళ్లింది. అనంతరం తండ్రి అత్తగారింటికి ఫోన్ చేసి అడగగా రాలేదని చెప్పడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధూకర్ రెడ్డి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో విషాదం


ఐడీఏ బొల్లారం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ


చికిత్స పొందుతూ మృతి చెందిన కార్తీక్, అనిత (ఫైల్)

ఐడీఏ బొల్లారం/శివ్వంపేట/తూప్రాన్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో చోటు చేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ముగ్గురు మంగళవారం మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ప్రాంతంలోని ఐడీఏ బొల్లారం ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో క్లీనర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో ఓ విద్యార్థి, తూప్రాన్ మండలం అల్లాపూర్ శివారులో జరిగిన ఘటనలో మహిళ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొని క్లీనర్..

పంక్చర్ అయిన లారీ టైర్‌ను మారుస్తుండగా వెనుకనుంచి మరో లారీ ఢీకొన్న ఘటనలో క్లీనర్ దుర్మరణం చెందగా, డ్రైవర్‌కు గాయలయ్యాయి. ఈ సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో చోటు చేసుకున్నది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడలోని రైస్‌మిల్లు నుంచి బియ్యం లోడ్‌తో బీదర్‌కు బయలుదేరిన లారీ అవుటర్ రింగ్‌రోడ్‌పై నుంచి వెళ్తుండగా ఐడీఏబొల్లారం వద్దకు చేరుకోగానే టైర్ పంక్చర్ అయింది. క్లీనర్ హిజాజ్ (36)డ్రైవర్ ఎక్బాల్‌తో కలిసి టైర్ మార్చడంలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ కంటైనర్ ఆగిఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో క్లీనర్ హిజాజ్‌కు తీవ్రగాయాలై దుర్మరణం చెందగా, డ్రైవర్ ఎక్బాల్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్ ధాన్యం కుప్పను ఢీకొని విద్యార్థి..

శివ్వంపేట మండలం గోమారంలో రోడ్డుపై ధాన్యం కుప్పను బైక్ ఢీకొన్న ఘటనలో ఐటీఐ విద్యార్థి మరణించగా మరో విద్యార్థికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన బాణాపురం కార్తీక్(16) ఐటీఐ మొదటి సంవత్సరం పూర్తి చేసుకున్నాడు. కొత్తోళ్ల యశ్వంత్ సెకండియర్ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు కలిసి సోమవారం రాత్రి కూరగాయలు తీసుకువచ్చేందుకు పెద్ద గొట్టిముక్ల నుంచి బైక్‌పై గోమారం గ్రామానికి బయలుదేరారు. గోమారంలోని ఉన్నత పాఠశాల వద్దకు రాగానే రోడ్డుపై ఉన్న వరి ధాన్యం కుప్పలను ప్రమాదవశాత్తు బైక్ ఢీకొంది. ఈ ఘటనలో రోడ్డు పక్కన బండరాయిపై పడటంతో కార్తీక్ తలకు తీవ్ర గాయం కాగా, మరో విద్యార్థి యశ్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కార్తీక్‌ను మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ బైక్‌పై నుంచి పడి మహిళ..

శుభకార్యానికి బైక్‌పై వెళ్తూ అదుపుతప్పడంతో తల్లికొడుకులకు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తల్లి మృతిచెందింది. తూప్రాన్‌ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లికి చెందిన లచ్చిగల్ల అనిత (45), ఆమె కుమారుడు లచ్చిగల్ల ప్రభాకర్ ఈ నెల 23న వర్గల్ మండలం వేలూరులో బంధువుల ఇంట్లో జరుగుతున్న వివాహానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో గజ్వేల్ - తూప్రాన్ రోడ్డుపై ఇసుక కారణంగా బ్రేక్ వేయడంతో బైక్ అదుపుతప్పి కిందపడటంతో తల్లికొడుకులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అనిత మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ వివరించారు. భర్త మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పేదల భూములు లాక్కుంటారా?


కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిమ్జ్ భూ బాధితుల ధర్నా

సంగారెడ్డి రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): పేదల భూములకు తక్కువ పరిహారం చెల్లించి అప్పనంగా లాక్కుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని విమర్శించారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట మంగళవారం సీపీఎం పార్టీ అధ్వర్యంలో నిమ్జ్ భూ బాధితులు ధర్నా చేశారు. అంతకు ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి భూములను గాని, మాజీ సీఎం కేసీఆర్ భూములను గాని కేవలం రూ. 15 లక్షలకు ఎకరా చొప్పున అమ్ముతారా అని ప్రశ్నించారు. జహీరాబాద్ నిమ్జ్ రైతులకు 2023 భూ చట్టం ప్రకారం మార్కెట్ ధరకంటే మూడింతలు అదనంగా నష్టపరిహారం చెల్లించాలని, ప్రతీ ఎకరాకు 120 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పారిశ్రామికవేత్తలే కాదు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చినా నిమ్జ్ భూముల్లో అడుగు పెట్టనీయమని హెచ్చరించారు. లగచర్లకు ఓ న్యాయం, నిమ్జ్‌కో న్యాయమా అని ఆయన ప్రశ్నించారు. సీఎంను కలిసి నిమ్జ్ భూ బాధితుల పక్షాన చర్చిస్తామని జాన్‌వెస్లీ తెలిపారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జహీరాబాద్ సీపీఎం ఏరియా కార్యదర్శి రాంచంద్రం మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాజయ్య, మాణిక్యం, జి.సాయిలు, నర్సింలు, మహిపాల్, నాగేశ్వర్‌రావు, వద్యాసాగర్, కృష్ణ, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

కంగ్టి, మే 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సిద్దేశ్వర ఆలయం సమీపంలో మంగళవారం కుక్కలు ఓ లేగదూడపై దాడిచేసి చంపేశాయి. కుక్కలు లేగదూడను యథేచ్ఛగా కరిచి తీవ్రంగా గాయపరచడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. ఇటీవల కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తూ దాడులు చేయడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి


శిరీష మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జగదేవ్‌పూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్లపల్లిలో వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకా రం.. జనగామ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన శిరీష(21)తో జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది వంశీధర్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం, ఇతర లాంఛనాలతో పెళ్లిని ఘనంగా జరిపించారు. వారికి ఒక పాప సంతానం. అయితే కొద్దిరోజులుగా భర్త వంశీధర్ శిరీషను పుట్టింటి నుంచి అదనంగా వరకట్నం తీసుకురమ్మని ఇబ్బందులకు గురిచేయగా రెండు విడతల్లో రూ.1.50లక్షల వరకు ఇచ్చారు. ఇటీవల వంశీధర్ మద్యానికి బానిసై పుట్టించి నుంచి మరింత డబ్బు తీసుకురావాలంటూ వేధిస్తున్నాడు. సోమవారం రాత్రి కట్నం కోసం భార్యతో గొడవపడ్డాడు. ఈ వేధింపులు భరించలేక శిరీష రాత్రి కుటుంబ సభ్యులు నిద్రించిన తర్వాత బెడ్రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. మృతురాలి తల్లి రేణుక ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అదృశ్యమైన వ్యక్తి బావిలో శవంగా..

కొండపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన వ్యక్తి బావిలో మృతదేహం లభ్యమైన సంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో చోటుచేసుకున్నది. తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సున్నం భాస్కర్ (32)అనే వ్యక్తి ఈ నెల 25న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం కుటుంబీకులు వెతికినా ఫలితం లేకపోయింది. తిమ్మారెడ్డిపల్లి శివారులో వ్యవసాయ బావి వద్ద చెప్పులు కనబడడంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. గ్రామస్థుల సహకారంతో పోలీసులు సోమవారం పొద్దుపోయే వరకు గాలించగా రాత్రి భాస్కర్ శవం లభ్యమైంది. అప్పుల బాధతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబీకులు పేర్కొన్నారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

జోగిపేట రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జోగిపేట ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేటకు చెందిన మంగలి శ్రీకాంత్ కట్టింగ్ షాప్ నడుపుతూ జీవిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు.ఎస్ఐ పాండు ఘటనాస్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికుడి మృతి

శివ్వంపేట్, మే 27(ఆంధ్రజ్యోతి) గుడి నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఏపీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం లింగోజిగూడ తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ కాకినాడ ప్రాంతంలోని పెద్దాపురానికి చెందిన శిరం కొండబాబు(50) మండల పరిధిలోని లింగోజిగూడ తండాలో గుడి నిర్మాణం పనులు చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారిపడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువైన కొయ్యల శ్రీను ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని నర్సాపూర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి: సంగారెడ్డి ఎస్పీ

సంగారెడ్డి క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండగ సందర్భంగా గోవులు, పశువుల అక్రమ రవాణా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. జిల్లాలోని కంది, ముత్తంగి పోలీస్ చెక్‌పోస్టులను ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ, పశువుల అక్రమ రవాణా జరుగకుండా చూడాలన్నారు. రాత్రి వేళల్లో చెక్‌పోస్టులలో విధులు నిర్వహించే సిబ్బంది, లైట్ బటన్,రిఫ్లెక్షన్ జాకెట్ ధరించాలని సూచించారు.

పరీక్ష రాస్తున్న ఇంటర్ విద్యార్థికి అస్వస్థత

కొండపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): కొండపాక జూనియర్ కళాశాలలో దుద్దెడ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి మంగళవారం ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాస్తూ అస్వస్థతకు గురయ్యాడు. నారాయణఖేడ్ కు చెందిన నిరీక్షన్ అనే విద్యార్థి కొండపాక మండలం దుద్దెడ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత సెలవుల్లో ఇంటికి వెళ్లిపోయారు. కెమిస్ట్రీ పరీక్ష కోసం ఇంప్రూమెంట్ కట్టి పరీక్ష రాసేందుకు వచ్చాడు. మంగళవారం కొండపాక జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో పరీక్ష రాస్తుండగా కొద్దిసేపటికి నిరీక్షన్‌కు వాంతులు విరేచనాలు అయ్యాయి. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసినప్పటికీ తగ్గలేదు. దీంతో వెంటనే 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.





చేనుకు చేవ.. వేప

చీడపీడల నివారణకు దోహదం.. వేప పిండి, నూనె అన్ని ఎరువులే

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు.. భూసారం పెంచడమే లక్ష్యం

సిద్దిపేట రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): వేప ఆరోగ్య ప్రదాయిని. వ్యవసాయంలోనూ వేపకు ప్రాధాన్యం ఉంది. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వేప పిండి, వేప నూనె, వేప కషాయంలతో సేంద్రియ ఎరువులను తయారు చేసి వాడితే భూమి సారవంతంగా మారడంతోపాటు పంట దిగుబడులు పెరుగుతాయని చెబుతున్నారు.

వేప పిండితో తెగుళ్ల నివారణ..

వేపపిండితో పంటలో వేరు కుళ్లు, దుంప కుళ్లు వంటి తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చు. ఎకరానికి నాలుగు నుంచి ఐదు సంచుల వేపపిండి వినియోగించడం వల్ల క్రిమికీటకాలను నివారించవచ్చు. ఎండు తెగులు నివారణకు ఉపయోగించే ట్రైకోడర్మాతోపాటు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి కలిపి వాడితే మంచి ఫలితం ఉంటుంది. ఐదు కిలోల యూరియాకు కిలో వేప పిండి కలిపి వాడితే మంచి ఫలితం ఉంటుంది. యూరియాపై వేపపిండి ఒక పొరలా ఏర్పడడంతో తొందరగా నీటిలో కరిగి మొక్కకు బలాన్ని చేకుర్చుతుంది.

పంటలకు రక్షణగా వేప గింజల కషాయం

ఖరీఫ్ సీజన్‌లో వేప గింజలు విరివిగా వేప గింజల కషాయాన్ని తయారు చేసుకోవచ్చు. వేప గింజలను పొడిగా చేసి ఓ వస్త్రంలో కట్టి పది లీటర్ల నీటిలో సుమారు పది గంటల పాటు నానబెడితే వేప కషాయం రెడీ అవుతుంది. ఇలా తయారు చేసుకున్న కషాయాన్ని వంద లీటర్ల నీటిలో వంద గ్రాములు కలిపి ఎకరానికి స్ప్రే చేస్తే పురుగు గుడ్డు దశ, కోశస్థ దశ, ప్యూపా దశలను అరికట్టవచ్చునని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

వేప నూనెతో..

వేప నుంచి నూనె తీసిన తర్వాత మిగిలే చెక్కను వృథా చేయకుండా భూమిలో వేయడం వల్ల నాలుగు నుంచి ఆరు శాతం నత్రజని, భాస్వరం, 0.5 శాతం పోటాష్ అందే అవకాశం ఉంటుంది. అలాగే పంటకు సల్ఫర్ కూడా అంది దిగుబడి పెంచడంలో తోడ్పడుతుంది. వేప నూనె పంటలో రసం పీల్చే పురుగులు, లద్దె పురుగులు, కాండం తొలుచు పురుగుల నివారణకు దోహదపడుతుంది. లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల వేప నూనెను కలిపి మొక్కలపై స్ప్రే చేస్తే ఆ వాసనకు ఆడ రెక్కల పురుగులు గుడ్లు పెట్టడానికి అవకాశం లేకుండా పోవడంతో పాటు పెట్టిన గుడ్లను పొదగకుండా చేస్తుంది. గుడ్డు నుంచి వచ్చే లార్వాను సమర్థవంతంగా అరికడుతుంది. పంటలో రెక్కల పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పురుగు ఉధృతిని బట్టి స్ప్రే చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. పంటలను ఆశించే గొంగళి పురుగుపైన స్ప్రే చేస్తే ఆ పురుగు తర్వాత దశను చేరుకోలేక చనిపోతుంది. మొక్కజొన్న పంటలో వచ్చే కత్తెర పురుగు నివారణకు పది వేల పీపీఎం అజాడిరక్టిన్ స్ప్రే చేస్తే పురుగు అదుపులోకి వచ్చి దిగుబడి తగ్గకుండా దోహదపడుతుంది.

రసాయన ఎరువులు వాడకం తగ్గించడమే లక్ష్యంగా...



రైతులు రసాయన ఎరువులు ఎక్కువ మొతాదులో వాడటం వల్ల భూసారం దెబ్బతింటుంది. రైతులు లాభసాటి వ్యవసాయం చేసేలా సేంద్రియ పద్ధతుల్లో ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం. వేపపిండి వాడాలి అనుకునే రైతులు వేపకాయలను స్థానికంగానే సమకూర్చుకోవచ్చు. ఇది వేపపండ్లు లభించే కాలం కాబట్టి వేపకాయలను సేకరించి ఎండబెట్టిన తర్వత మిశ్రమంగా చేసి వాడుకుంటే వేప కంటే మించిన ఎరువు పంటలకు మరొకటి ఉండదు. చీడపీడల నివారణతో పాటు పంట ఉత్పత్తులను నిల్వ చేయడంలోనూ ఉపయోగించవచ్చు. వేపతో తయారు చేసే సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు. ఆ దిశగా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

- పద్మ, ఏడీఏ, సిద్దిపేట

జీవాల ఎరువుతో జీవం

అక్కన్నపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): భూసారం పెంపునకు మూగజీవాల ఎరువు ఎంతో దోహదపడుతుందని వ్యవసాయ నిపుణులు, అధికారులు సూచిస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గుతుండటంతో ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్ల విసర్జితాలు, కంపోస్టు వంటి సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని సూచిస్తున్నారు. రైతులు తమ పొలాల్లో గొర్రెలు, మేకల మందలు నిలుపడం ద్వారా వాటి ఎరువును పొలాలకు అందిస్తున్నారు. అలాగే పశువుల ఎరువును ట్రాక్టర్ ద్వారా పొలాలకు తరలించి చల్లుతున్నారు. పశువుల పేడ ట్రాక్టర్‌కు రూ.4వేల చొప్పున రైతులు కొనుగోలు చేస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

గొర్రెలు, మేకల మూత్రంలో పీహెచ్ విలువ 7.7 ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వీటి ద్వారా చౌడు భూములు సారవంతంగా మారుతాయి. మూగజీవా లీటర్ మూత్రంలో 9 నుంచి 13 గ్రాముల నత్రజని, 17 నుంచి 20 గ్రాముల పొటాషియం, పాస్పరస్ వంటివి ఉంటాయి. ఒక గొర్రె ద్వారా ఒక రాత్రికి లీటర్ మూత్రం, 380 నుంచి 540 గ్రాముల వరకు పేడ లభిస్తుంది. గొర్రెలు, మేకల మంద ద్వారా నత్రజని, బాస్పరం, పొటాష్‌తో పాటు బ్యాక్టీరియా, ప్రోటోజోవా, ఫంగి తదితర ఉపయోగకరమైన సూక్ష్మజీవులతో నేల సారవంతం అవుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

సేంద్రియ ఎరువులను వాడుతున్నాం..



భూసారం పెంచేందుకు సేంద్రియ ఎరువులనే వాడుతున్నాం. పశువుల పేడ, కోళ్ల ఎరువులు తీసుకువచ్చి పొలాల్లో చల్లుతున్నాం. గొర్రెలు, మేకల మందలను పొలాల్లో పెడుతున్నాం. సేంద్రియ ఎరువుల వినియోగంతో పంటల దిగుబడులు పెరుగుతున్నాయి.

-వంగల భాస్కర్ రెడ్డి, రైతు, గొల్లకుంట, అక్కన్నపేట మండలం

గొర్రెలు, మేకల మందలను నిలపాలి



రైతులు గొర్రెలు, మేకల మందలను పొలంలో ఆపితే అధిక దిగుబడి వస్తుంది. పొలాలు సారవంతంగా తయారవుతాయి. నత్రజని, పొటాష్, పాస్పరస్‌లను కూడా అందిస్తుంది. అలా గొర్రెల మందులు ఆపడంతో కలుపు మొక్కల నియంత్రణకు కూడా సహాయపడుతుంది.

-తస్లీమా సుల్తానా, మండల వ్యవసాయధికారి, అక్కన్నపేట







ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తున్న బిస్మాట్ ప్రతినిధులు

డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన బిస్మాట్ ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బిస్మాట్) ప్రతినిధులు కలిశారు. రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ, విద్యాహక్కు చట్టం అమలు, 25 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వారు భట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం తీసుకునే కార్యాచరణలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పినట్లు చెప్పారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బిస్మాట్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జలంధర్, ఉపాధ్యక్షులు మహ్మద్ షఫీ, దయాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రతినిధులు నారాయణరెడ్డి, భరత్‌కుమార్, మీనేంద్రరావు, దయాకర్‌రెడ్డి, సింహారెడ్డి, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌజ్ ప్రారంభానికి సిద్ధం

● గృహనిర్మాణశాఖ పీడీ మాణిక్యం



తూప్రాన్‌లో ఇందిరమ్మ మోడల్ హౌజ్‌ను పరిశీలిస్తున్న పీడీ

తూప్రాన్, మే 27 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్‌లో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌజ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ మాణిక్యం పేర్కొన్నారు. జిల్లాలో మొదటగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్‌హౌజ్‌ను మంగళవారం పరిశీలించారు. తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామని, మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శేషాద్రి, ఎంపీవో సతీష్, ఏఈ స్మైలీ వెరోనిక, సిబ్బంది పాల్గొన్నారు.

దత్తగిరి ఆశ్రమంలో కేశవరావు పూజలు

ఝరాసంగం, మే27(ఆంధ్రజ్యోతి) : మండలం పరిధి బర్దీపూర్ గ్రామంలోని దత్తగిరి ఆశ్రమంలో మంగళవారం నిర్వహించిన శనీశ్వరుడి జయంతి ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు కె.కేశవరావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ అర్చకులు వారి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్య శిఖమణి అవదూత గిరి మహారాజ్ వారిచే శనీశ్వరుడికి తైలాభిషేకంతో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మహామండలేశ్వర సిద్ధేశ్వరనందగిరి మహారాజ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



శనీశ్వరుడికి పూజలు చేస్తున్న ప్రభుత్వ సలహాదారుడు కేశవరావు

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావం

కొండపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భవించింది. కొండపాక శివారులో కొమురవెల్లి కమాన్ సమీపంలో ఒక హోటల్లో జరిగిన కళాకారుల సమావేశంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల కళాకారులు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి కళనే నమ్ముకుని జీవనం సాగిస్తూ, తెలంగాణ ఉద్యమంలో కళాకారులు ప్రధాన భూమిక వహించారని పేర్కొన్నారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ప్రభుత్వం ఒక్కొక్క కళాకారునికి 500 గజాల భూమి ఇవ్వాలన్నారు. అలాగే వడ్డీ లేని రుణాలు, వృద్ధ కళాకారులకు పెన్షన్లు తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు.

రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పత్తిపాటి రమణాకర్, ప్రధాన కార్యదర్శిగా సత్తార్, కోశాధికారిగా గజ్వేల్ వేణు, ఉపాధ్యక్షులుగా జీఎల్ నాందేవ్, ఫోక్ ఇండస్ట్రీ సలహాదారులుగా దరువు అంజన్న, మిట్టపల్లి సురేందర్, అంతడుపుల నాగరాజ్, అభినయ శ్రీనివాస్, కోదారి శీను, అంబటి వెంకన్న, బైరాగి మోహన్, కళాంజలి రాజేష్, దత్తాత్రేయ, చికోడు నరసింహులు, కాదూరి గణేష్, విష్ణు, కాపర్తి మల్లికార్జున్‌లను ఎన్నుకున్నారు. కోర్ కమిటీ సభ్యులుగా జడల రమేష్, మాట్ల తిరుపతి, శంకర్ బాబు, వడ్లకొండ అనిల్, బుర్ర సతీష్, పొద్దుపొడుపు శంకర్, మాంకాల ప్రసాద్, మల్లిక్ తేజ, పాత శ్రీధర్, గణ శ్యామ్, బుర్ర నటరాజ్, ఓరుగంటి శేఖర్, కోడం సంతోష్, తేలు విజయ, వినోద్, విజువల్ శ్రీనివాస్ తదితరులను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి, గొల్లపల్లి ఆంజనేయులు కళాకారులను శాలువలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ రంగాలకు చెందిన కళాకారులు

కేతకీలో భక్తుల రద్దీ

ఝరాసంగం, మే27(ఆంధ్రజ్యోతి) : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ కనిపించింది. అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమెల్యే సంజీవరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో శివరుద్రప్ప, పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.



క్యూలో బారులు తీరిన భక్తులు



శిక్షణా శిబిరంలో పాల్గొన్న కేడెట్లు

ఎన్‌సీసీ శిబిరం ప్రారంభం

పటాన్‌చెరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని 33 (తెలంగాణ) బెటాలియన్ ఎన్ సీసీ కేడెట్ల కోసం నిర్వహిస్తున్న సంయుక్త వార్షిక శిక్షణా శిబిరాన్ని (సీఏటీసీ 3) కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రమేష్ సరియాల్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ (రుద్రారం) ప్రాంగణంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో తెలంగాణ వ్యాప్తంగా 600 మంది క్యాడెట్లు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్, అసోసియేట్ ఎన్ సీసీ ఆఫీసర్లు, తెలంగాణలోని ఎన్‌సీసీ 9, 12, 32, 33వ బెటాలియన్ల కేడెట్లు పాల్గొన్నారు.

చదువుల సరస్వతులు రేవతి, నవ్య

● పరీక్ష ఏదైనా ఫస్ట్, సెకండ్ స్థానాలు వీళ్లవే

● పోటీ పరీక్షల్లో రాణిస్తున్న వీరారెడ్డిపల్లి అమ్మాయిలు

మిరుదొడ్డి, మే27(ఆంధ్రజ్యోతి): పరీక్ష ఏదైనా రాష్ట్రస్థాయిలో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు వీళ్లవే.. ఇటీవల విడుదలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఈసెట్ ఈసీఈ విభాగం ఫలితాల్లోనూ తొలి రెండు ర్యాంకులు సాధించి ఔరా అనిపించారు సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేవతి, నవ్యలు. వీరిద్దరు సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో 10 వ తరగతి వరకు విద్యను అభ్యసించారు. అనంతరం పాలీసెట్ రాయడంతో మంచి మార్కులతో సికింద్రాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈలో డిప్లొమాను పూర్తిచేశారు. ఈ నెల 15, 24వ తేదీల్లో వెలువడిన ఏపీ, టీజీ ఈసెట్ ఫలితాల్లోనూ ఇద్దరు ప్రథమ, ద్వితీయ ర్యాంకులను సాధించి అబ్బురపరిచారు.





కుటుంబ సభ్యులతో రేవతి, దివ్య

ఎలాంటి కోచింగ్ లేకుండానే..

మాది నిరుపేద కుటుంబం. నాన్న యాదగిరి వ్యవసాయదారుడు. అమ్మ కవితా బీడీ కార్మికురాలు. ముందు నుంచి ప్రత్యేక ప్రణాళికతో చదువుతున్నాను. ఏపీ ఈసెట్‌లో ఈసీఈ విభాగంలో 200 మార్కులకు గాను 169, టీజీ ఈసెట్‌లో 164మార్కులు రావడంతో రెండింట్లోనూ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు వచ్చింది. ఎలాంటి కోచింగ్ లేకుండా కేవలం అధ్యాపకులు చెప్పిన అంశాలను క్షుణ్ణంగా చదివి పరీక్ష రాశాను ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్)కు ఎంపికకావడమే తన లక్ష్యం.

-కట్లే రేవతి

ఐఏఎస్ కావడమే లక్ష్యం

మానాన్న నర్సింలు హమాలీ కార్మికుడు. తల్లి చిన్నవ్వ బీడీ కార్మికురాలు. నిత్యం అమ్మానాన్నల పడుతున్న కష్టం నన్ను కలిచివేస్తుంది. వారి కష్టాలను దూరం చేయాలన్న ఉద్దేశంతో బాగా చదివా. ఏపీ ఈసెట్‌లో ఈసీఈ విభాగంలో 200 మార్కులకు గాను 155, టీజీ ఈసెట్‌లో 200 మార్కులకు గాను 161 మార్కులను సాధించి రెండు చోట్లా రెండో ర్యాంకులను సాధించాను. ఇంజనీరింగ్‌ను పూర్తిచేసి యూపీఎస్‌సీ రాసి ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యం.

-పంజా నవ్య

పార్టీలకతీతంగా అభివృద్ధి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



వెంకటాయపల్లిలో పోస్టాఫీసు ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

తూప్రాన్, మే 27(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నట్లు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో ఏర్పాటు చేసిన నూతన పోస్టాఫీస్‌ను మంగళవారం పోస్టల్‌శాఖ సూపరింటెండెంట్ శ్రీహరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతంలో ఎన్నికైన ఎంపీలు పదేళ్లలో ఒక్కసారి కూడా కనిపించలేదని, తాను 24/7 అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తూప్రాన్ పట్టణంలో పోస్టల్‌శాఖకు చెందిన భూమి కబ్జాకు గురవుతుందన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం సిద్ధన్నపేటలో రైతులు 10 లారీల ధాన్యం పంపిస్తే, ఇప్పుడు 55 క్వింటాళ్ల ధాన్యం తక్కువ రాస్తానంటూ రైసుమిల్లర్ చెబుతున్నట్లు పేర్కొన్నారు. రామాయంపేటలో పచ్చజొన్నలు కొనుగోలు కేంద్రం లేదని చెప్పడంతో కలెక్టర్‌తో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని ఎంపీ వివరించారు. పోస్టాఫీసులో ఖాతాలు ప్రారంభించినవారికి ఖాతా పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ లంబ వెంకటమ్మ, రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శేషాద్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, నత్తి మల్లేశ్‌ముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పిట్ల పోచయ్య, జానకీరాంగౌడ్, మహేశ్‌గౌడ్, నర్సోజీ, విఠల్ పాల్గొన్నారు.

ఉత్తమ రక్తదాతలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ రక్తదాతల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రెడ్ క్రాస్ సొసైటీ మెదక్ శాఖ చైర్మన్ లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది మే నుంచి ఈ ఏడాది మే 31 వరకు 25 సార్లు కంటే ఎక్కువ సార్లు రక్త దానం చేసిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో ఒకరిని ఎంపిక చేసి హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందజేసి, సన్మానం చేయనున్నట్లు తెలిపారు. అర్హులైనవారు రక్తదానం ఫొటోలు, పేపర్ క్లిప్పింగ్‌లు, సర్టిఫికెట్లతోపాటు తమ వివరాలను కింద తెలిపిన నంబర్లకు వాట్సప్ చేసి పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పి.లక్ష్మణ్ యాదవ్ వైస్ చైర్మన్ 7989964476, టి.సుభాష్ చంద్రబోస్ సెక్రటరీ 9849099670, డీజీ శ్రీనివాసశర్మ ట్రెజరర్ 9440451575 నంబర్లకు మే 31 సాయంత్రం 6 గంటల లోపు పంపించాలన్నారు.

ఈ రోడ్లకు మోక్షమెప్పుడో!

- బురదమయంగా మట్టి రోడ్లు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

కొండపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలోని మట్టి రోడ్లతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి పలు గ్రామాల రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. కొండపాక మండలం వెలికట్ట శివారులోని రాజీవ్ రహదారి నుంచి ఆరేపల్లి మీదుగా వెలికట్ట వరకు, ఆరేపల్లి నుంచి గుంటూరు వాడ మీదుగా దుద్దెడ చేర్యాల రోడ్డు వరకు ఉన్న రహదారులు అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. ప్రత్యామ్నాయంగా గ్రామస్థులు దుద్దెడవైపు వెళ్లాలంటే రాజీవ్ రహదారిపై నుంచి రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి వస్తుంది. నిత్యం కొండపాక సమీకృత కార్యాలయాలకు పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆరేపల్లి ప్రజలు నిత్యవసర వస్తువుల కోసం వెలికట్టకు రావాల్సి ఉంటుంది. ఈ తరుణంలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయడంతోపాటు మట్టి రోడ్డును బీటీగా మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఆరేపల్లి వెలికట్ట రోడ్డు దుస్థితి

మరమ్మతులకు నోచుకోని బీటీ రోడ్లు

కొండపాక మండలంలోని పలు గ్రామాల బీటీ రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో గుంతల మయంగా మారాయి. రోడ్లపై ఉన్న బీటీ అంతా కొట్టుకపోవడంతో కంకరలేచి వాహనదారులకు ఇబ్బందికరంగా ఉంది. కొండపాక నుంచి దుద్దెడ తొగుట రోడ్డు వరకు గల బీటీ రోడ్డు పూర్తిగా పాడైపోయింది. అలాగే ఎర్సాన్ పల్లి నుంచి ఖమ్మంపల్లి రోడ్డు పరిస్థితి కూడా ఇలానే ఉంది.



జప్తి-నాచారం రోడ్డు

న్యూస్ బాక్స్

డ్రంకెన్ డ్రైవ్‌లో 10 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మే 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కొన్ని రోజుల క్రితం నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 10 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు. వారిని మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 10 మందికి రూ.15,000 జరిమానా విధించారు.

డ్రగ్స్‌ను తరిమికొట్టాలి

- జేఏసీ నియోజకవర్గ కోఆర్డినేటర్



జనగామలో మాట్లాడుతున్న జేఏసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్

అక్కన్నపేట, మే 27 (ఆంధ్రజ్యోతి): సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌ను తరిమికొటాలని జేఏసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం అక్కన్నపేట మండలంలోని జనగామ, అంతకపేట, కట్కూర్, కన్నారం గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకజ్ఞానం లేనటువంటి విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలవాల్సిన యువతరం అర్థాంతరంగా తనువు చాలించి కుటుంబంలో శోకం మిగులుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, జేఏసీ నాయకులు ద్యాగల సారయ్య, చేప్యాల ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

కుకునూరుపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి జిల్లా పరిషత్ నందు మంగళవారం మండలంలోని పాఠశాలలకు అందించే పాఠ్యపుస్తకాలు వచ్చాయి. వీటిని రెండు రోజుల్లో వివిధ పాఠశాలలకు అందజేస్తామని ఎంఈఓ బచ్చలి సత్తయ్య తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభానికి ముందే అన్ని పాఠశాలలకు అందజేస్తామని తెలిపారు.

ఆర్యవైశ్యుడికి ఆపన్నహస్తం

సిద్దిపేట కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరంకు చెందిన ఆర్యవైశ్యుడు పడమటింటి లక్ష్మీ నర్సయ్యకు సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఆర్థిక సాయాన్ని అందజేశారు. లక్ష్మీనరసయ్య ఆర్థికంగా చితికిపోయి అన్ని రకాలుగా ఇబ్బందులతో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. లక్ష్మీ నరసయ్య పరిస్థితి గురించి కోహెడ మండల సంఘం ప్రతినిధులు జిల్లా కమిటీ దృష్టికి తెచ్చారు. స్పందించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ యువజన, సేవాదళ్, మహిళా విభాగాల సహకారంతో 60 గజాల స్థలం కొనుగోలు చేశారు. అందుకు అవసరమైన 61 వేల రూపాయలను లక్ష్మీనరసయ్యకు అందజేశారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కొండపాక బీజేపీ మండల కార్యవర్గం

కొండపాక, మే 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కొండపాక మండల కమిటీని ఏర్పాటు చేసినట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ తెలిపారు. అధ్యక్షుడిగా నీల సత్యం, ఉపాధ్యక్షులుగా బాలకిషన్, సురేందర్, అనిల్, మల్లేశం, ప్రధాన కార్యదర్శులుగా ప్రశాంత్, స్వామి, కార్యదర్శులుగా అభిలాష్, బిక్షపతి, వేణు, రాజు కోశాధికారిగా అనిల్, కార్యవర్గ సభ్యులుగా 34 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాల మేరకు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డును మంజూరు చేయాలి

మిరుదొడ్డి, మే27(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం తిమ్మాపూర్ నుంచి మిరుదొడ్డి మండలం కొండాపూర్, అందె గ్రామాలకు ఉన్న పీఆర్‌రోడ్డును ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చి డబుల్‌రోడ్డును చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు కవితారాజు, శంకర్‌లు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ కొదండరామ్‌లను మార్యదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వర్షం పడితే చాలు రోడ్డు బురదమయంగా మారుతుందని, వెంటనే రోడ్డు పనులను చేపట్టేవిధంగా చేయాలని విన్నవించారు. దీంతో మంత్రి కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఖాతా - సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ బస్సు రద్దు

నంగునూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): నంగునూరు మండలం ఖాతా-దూల్మిట్ట -లింగాపూర్ నుంచి సికింద్రాబాద్ నడిచే ఎక్స్ ప్రెస్ బస్సును రద్దు చేశారు. ఈ బస్సు రద్దుతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఎక్స్ ప్రెస్ బస్సు రద్దు కావడంతో నేరుగా వెళ్లకుండా సిద్దిపేట వరకు వెళ్లి మరో బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. నంగునూరు మీదుగా గట్ల మల్యాల, కొండంరాజుపల్లి, ఖాతా, జాల పల్లి, ధూల్మిట్ట ,లింగాపూర్, సికింద్రాబాద్ నైట్ హాల్ట్ బస్సు రద్దుచేసి దాని స్థానంలో ఆర్డినరీ బస్సు నడిపిస్తున్నారు. గతంలో నంగునూరుకు చాల బస్సులు నడిచేవని, సిద్దిపేట ఆర్టీసీ అధికారులే కావాలని రద్దు చేసి ఇతర రూట్ లోకి మళ్ళించారని ప్రయాణికులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సును రద్దు చేయాలనే కుట్రతోనే అన్ని రూట్లో బస్సులు రద్దు చేస్తున్నారని వివిధ గ్రామాల ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఆదాయ వనరులున్న రూట్‌లో బస్సులు నడిపించి ప్రయాణికులకు ఇబ్బందులు కల్పించకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా రద్దు చేసిన ఎక్స్ ప్రెస్ బస్సు పునరుద్ధరణ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్జకుంటకు డబుల్‌రోడ్డు నిర్మించాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్

చేర్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి డబుల్ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ అన్నారు. మండలంలోని గుర్జకుంట గ్రామంలో మంగళ వారం నిర్వహించిన పార్టీ గ్రామమహాసభలో ఆయన మాట్లాడారు. సింగిల్‌రోడ్డు వలన ప్రజలు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. అనంతరం గ్రామకమిటీ కార్యదర్శిగా నంగి కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలి

- గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భిక్షపతినాయక్

నంగునూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాదులోని ప్రజా భవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్తున్న సర్పంచ్‌లను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసం అని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, జేపీ తండా మాజీ సర్పంచ్ ముఖ్య భిక్షపతినాయక్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వెళ్తున్న సర్పంచ్‌లను రాజగోపాలపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ప్రజల అవసరాల నిమిత్తం చేసిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతిపత్రం ఇవ్వడానికి పిలుపునిస్తే ఉదయాన్నే పోలీసులు హైదరాబాద్ వెళ్లకుండా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థ ఎన్నికలు నిర్వహించాలన్నారు. అరెస్ట్ అయిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్ పట్ల కక్షపూరితంగా వ్యవహరించడం దారుణం

చేర్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని రేణుకా గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు,, దూళిమిట్ట మండలాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ-కారు రేస్ పోటీలతో కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర కీర్తిని విశ్వవ్యాప్తం చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నయవంచన పాలన చేస్తుండటంతో రాష్ట్ర ప్రజల పక్షాన కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారన్నారు.

అందాల పోటీలపై ఉన్నశ్రద్ధ ప్రభుత్వాస్పత్రులపై లేదు

ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ పేదలకు ఉపయోగపడే ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధిపై ఎంతమాత్రం లేదన్నారు. చేర్యాలలో ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణం బీఆర్ఎస్ హయాంలోనే తుది దశకు చేరుకున్నా, పెండింగ్ పనులకోసం బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రారంభించిన కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగిస్తున్న ఈ ప్రభుత్వం అదనంగా అందిస్తానన్న తులం బంగారాన్ని కొనసాగించాలని మీ మాటగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మద్దూరు మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను అందించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయంలో 12 లక్షల మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకాన్ని అందించినట్లు తెలిపారు. మండలంలో రోడ్ల సౌకర్యాలు అధ్వాన్నంగా ఉన్నాయని, మంత్రి సీతక్కతో రెక్వెస్ట్ చేసి తన నియోజకవర్గానికి నిధులు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

పేదల నేస్తం కాంగ్రెస్ ప్రభుత్వం : మాజీ జడ్పీటీసీ

చేర్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా సీఎం రేవంత్ సర్కార్ నేస్తంలా పరిపాలన కొనసాగిస్తుందని చేర్యాల మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు అన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా పట్టణానికి చెందిన ఊట్లపల్లి కిష్టయ్యకు రూ.60వేలు, పల్లెల రేణుకు రూ.60వేలు, గుట్టమీది శ్రీశైలంకు రూ.60వేలు, సీహెచ్ రవికి రూ.33వేలు, సైకం వివేకారెడ్డికి రూ.12,500 చొప్పున మంజూరైన చెక్కులను మంగళ వారం చేర్యాలలో లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి సహకారంతో ఎంతోమందిపేదలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధిచేకూరుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఊట్లపల్లి శ్రీనివాస్, ఖాజా, ఉడుముల బాల్‌రెడ్డి, ఉడుముల భాస్కర్‌రెడ్డి, చెవిటి లింగం, యాదగిరి, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎంను సస్పెండ్ చేయాలి

చేర్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకంలో మోసానికి పాల్పడి ధాన్యం దోపిడి జరిగిన నేపథ్యంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐకేపీ ఏపీఎంను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం కొమురవెల్లిమండల కార్యదర్శి తాడూరి రవీందర్ అన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తూకంలో మోసపోయిన ధాన్యం డబ్బులు రికవరీ చేసి రైతులకు అందించాలని కోరారు.

పీఏసీఎస్ చైర్మన్‌ను పరామర్శించిన ఎంపీ చామల

చేర్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పితృవియోగం పొందిన చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణను భువన గిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. అతడి మృతి పట్ల సంతాపం వ్యక్తంచేశారు. ఈసందర్భంగా మద్దూరు జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, వజ్రోజు శంకరాచారి తదితరులున్నారు.

ఘనంగా నెహ్రూ వర్ధంతి



నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూజలహరికృష్ణ, అత్తుఇమామ్

న్యూస్‌నెట్‌వర్క్ / మే 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనేక పట్టణాలల్లో దివంగత మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



అప్పుపుట్టట్లే..!

(5వ పేజీ తరువాయి..)

ఇక మల్లన్నసాగర్ ముంపు గ్రామాల ప్రజలు ఉపాధి లేకపోవడంతో వారికి ఇచ్చిన 250 చదరపు గజాల స్థలాన్ని ఆయా ఫైనాన్సులకు తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుంటున్నట్లు ఆయా గ్రామాల ప్రజలే చెబుతున్నారు.

భూములు అమ్ముదామన్న కొనని పరిస్థితి

భూక్రయవిక్రయాలతో ఎక్కువ లాభాలు గడించవచ్చన్న నమ్మకంతో సామాన్యులు అధిక వడ్డీకి అప్పులు తెచ్చి మరీ భూములు కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగం బాగా నడుస్తుందని, శ్రమ లేకుండా త్వరగా ధనవంతులు కావచ్చన్న ఆలోచనతో అప్పులు చేసి అడ్డగోలుగా భూములు కొనిపెట్టుకున్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలింది. మూడేళ్లుగా సరిగ్గా వ్యాపారంలో వృద్ధి లేకపోగా, కొనుగోళ్లు నిలిచి వారి ఆర్థిక పరిస్థితి ఆందోళకరంగా మారింది. అప్పులిచ్చిన వారి వేధింపులతో వారి పరిస్థితి మునిగిపోయే నావాలా మారింది. కోట్లు పెట్టి ఇళ్ల నిర్మాణాలు చేస్తే అవి ప్రస్తుతం విక్రయం కాక అప్పులకు వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీజనల్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభించడం, పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌లు, కాంట్రాక్టర్ల, ఉద్యోగుల బిల్లులను విడుదల చేస్తే తప్ప మార్కెట్‌లో డబ్బు దొరకదని పలువురు ఆందోళన చెందుతున్నారు.

భోళా శంకరుడి బ్రహ్మోత్సవం



శ్రీఉమాపార్థివ కోటి లింగేశ్వరాలయంలోని స్వామి దర్శనం

సిద్దిపేట కల్చరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రశాంత్‌నగర్‌లో కొలువైన శ్రీ ఉమా పార్థివ కోటి లింగేశ్వర స్వామి దేవాలయ 46వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలకు (షట్‌చత్వారింశత్) ఆలయం ముస్తాబవుతోంది. నేటి నుంచి 31 వరకు జరిగే ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీ రాజరాజేశ్వరి దేవి కుంకుమార్చన, ఆర్ధోత్సవం, స్వామివారికి ఎదుర్కొల్లు, స్వామివారి కల్యాణత్సవంతో పాటు విశేష పూజ కార్యక్రమాలు నాలుగురోజులపాటు నిర్వహించనున్నారు.

నెల రోజులైనా ధాన్యం బిల్లులు రాలే

నంగునూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి నెల రోజులు అవుతున్న రైతులకు డబ్బులు పడడం లేదని మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అన్నారు. మంగళవారం నంగునూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నంగునూరు మండలం సిద్ధన్నపేట మార్కెట్ యార్డులో సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలుకు కేంద్రం ఏర్పాటు చేశారు. నెల రోజుల క్రితం రైతులు 12 లారీల ధాన్యాన్ని అమ్ముకున్నారు. ధాన్యముకు సంబంధించి ఫోన్‌లో ఓటీపీ సైతం అడిగారు. కానీ డబ్బులు జమ చేయడం లేదని ఆరోపించారు. వాన కాలం సీజన్ ప్రారంభమైనందున వెంటనే రైతులు అమ్ముకున్న ధాన్యం డబ్బులు వారి ఖాతాలో జమ చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులందించాలి

చేర్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందించాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక విషయంలో పేదలకు అన్యాయం చేస్తు పార్టీ కార్యకర్తలకే కట్టబెడుతుండటం తగదన్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డులందించాలని కోరారు. పేదల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా అవినీతికి తావులేకుండా లబ్దిదారులను ఎంపికచేయాలని, లేనియెడల ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



మురారి గౌడ్ (ఫైల్)

తొగుట, మే 27(ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యమైన ఘటన తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బందారం గ్రామానికి చెందిన నేరేండ్ల రజిత- హన్మాగౌడ్ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. కొడుకు మురారి గౌడ్ (17) సిద్దిపేట పట్టణంలోని ఇందూర్ కళాశాలలో పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆరు నెలలుగా చదువుమానేసిన మురారి గౌడ్ మొబైల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. వారం రోజుల క్రితం అమ్మమ్మ వాళ్ల ఊరైన వెంకట్రావ్‌పేట గ్రామానికి చేరుకున్నాడు. ఈనెల 26న సాయంత్రం హెయిర్ కటింగ్ చేసుకుంటానని ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఇంట్లో నుంచి వెళ్లిన బాలుడు రాత్రి కావస్తున్నా ఇంటికి చేరుకోకపోవడంతో బాలుడు తాత ఆందోళనతో అతడి తలిదండ్రులకు సమాచారమందించారు. బంధువుల ఇళ్లతోపాటు చుట్టు పక్కల గ్రామాలలో వెతికిన బాలుడి ఆచూకి లభించలేదు. దీంతో మంగళవారం సాయంత్రం కుటుంబీకులు తొగుట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు.

టీజేఎఫ్ రజతోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్ రావు

సిద్దిపేట కల్చరల్/గజ్వేల్, మే 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సంబరాల పోస్టర్‌ను సిద్దిపేట క్యాంప్ ఆఫీస్ లో పలువురు జర్నలిస్టులు సిద్దిపేట ప్రజా ప్రతినిధుల సమక్షంలో మాజీ మంత్రి హరీష్ రావు రజతోత్సవ వేడుకల గోడ పత్రికని ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకపాత్ర పోషించిన టీజేఎఫ్.. 25 వసంతాల సంబరాలు జరుపుకోవడం ఎంతో గర్వంగా ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. తెలంగాణ జర్నలిస్ట్‌ఫోరం(టీజేఎఫ్) రజతోత్సవ సంబురాల పోస్టర్‌ను గజ్వేల్ పట్టణంలో గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు నవీన్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు.

వీపీవో వ్యవస్థను మెరుగుపరచాలి

- గజ్వేల్ ఏసీపీ కె. నర్సింహులు

గజ్వేల్, మే 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విలేజ్ పోలీసింగ్ ఆఫీసర్(వీపీవో) వ్యవస్థను మెరుగుపరచాలని గజ్వేల్ ఏసీపీ కె. నర్సింహులు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాలను తరచుగా పోలీసులు సందర్శించాలని, గ్రామాల్లో వీపీవో వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. ప్రతి కేసులో పారదర్శకంగా పరిశోధన కొనసాగాలని, గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా నడుచుకోవాలని, వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను సంబంధిత యజమానులకు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని సూచించారు. కేడీలు, బీసీలు, సస్పెక్ట్‌లు, రౌడీలపై నిరంతర నిఘా ఉండాలని, అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ ప్రతి రోజు చేయాలని, ముందస్తు సమాచారాన్ని సేకరించాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

అండగా సీఎంఆర్ఎఫ్ చెక్కు



బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్

దౌల్తాబాద్, మే27 (ఆంధ్రజ్యోతి): నిరు పేదలకు మెరుగైన వైద్య చికిత్సల కోసం అత్యవసర సమయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో భరోసా కల్పిస్తుందని దౌల్తాబాద్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్ అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామానికి చెందిన గొల్ల యాదగిరికి ఇటీవలే మోకాలికి సర్జరీ అయ్యింది. విషయం తెలుసుకున్న మండల యూత్ అధ్యక్షుడు నర్ర రాజేందర్ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బాధితుడు యాదగిరికి రూ.1 లక్ష 20 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంజూరు చేశారు. మంగళవారం నర్ర రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి బాధితుతు యాదగిరికి రూ.1 లక్ష 20 వేల సీఎం ఆర్ ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సల్లస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాజీ హోంమంత్రిని కలిసిన జుబేర్

ములుగు, మే 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ హోంమంత్రి మహమ్మద్‌అలీని బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర యూత్ విభాగం ఉపాధ్యక్షుడు మహమ్మద్ జుబేర్ ఆసుపత్రిలో పరామర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆసుపత్రిలో మాజీ హోం మంత్రి మహమూద్ అలీ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర నాయకుడు జుబేర్ ఆసుపత్రిలో ఆయనను కలిసి పరామర్శించారు.

గోసాన్‌పల్లిలో దొంగతనం

దుబ్బాక, మే27(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలం గోసాన్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన కొమ్ముస్వామి డబుల్‌బెడ్రూం ఇంటి కాలనీలో నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి గ్రామంలోనే తన పాత ఇంటికి కుటుంబసమేతంగా వెళ్లడంతో డబుల్‌బెడ్రూం ఇంటికి తాళం వేశారు. ఇదే అదునుగా చూసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగలకొట్టి, ఇంటిలో చొరబడి, ఇంట్లో ఉన్న తులంన్నర బంగారం, 20 తులాల వెండిని దోచుకుని వెళ్లారు. సోమవారం పగలకొట్టిన తాళాన్ని చూసిన కొమ్ముస్వామి వెంటనే దుబ్బాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దుబ్బాక పోలీసులు సంఘటన సలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రమాబాయి అంబేడ్కర్ త్యాగం మరువలేనిది

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

హుస్నాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఉన్నత శిఖరాలు అధిరోహించడంలో అతని భార్య మాతా రమాబాయి అంబేడ్కర్ త్యాగం మరువలేనిదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాతా రమాబాయి వర్ధంతిని దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం లింగమూర్తి మాట్లాడుతూ, అతి చిన్న వయస్సులోనే వివాహం జరిగి అంబేడ్కర్ భార్యగా అడుగు పెట్టిన రమాబాయి ఎన్నో కష్టాలను అనుభవించిందన్నారు.

నిధులు మంజూరు చేయాలని ఎంపీకి వినతి

రాయపోల్, మే 27 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలం గుర్రాలసోఫా నుంచి వడ్డెపల్లి, దొడ్లపల్లి, అప్పాయిపల్లి, బేగంపేట మీదుగా వర్గల్ మండలం నాచారం వరకు వెళ్లే తారు రోడ్డు కొంత కాలం క్రితం పూర్తిగా పాడైపోయింది. అక్కడక్కడ రోడ్డుపై గుంతలు ఏర్పడడమే కాకుండా కంకర తేలి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇదిలా ఉండగా మంగళవారం బేగంపేట గ్రామస్థులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కలిసి పాడైన రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయించాలని వినతిపత్రం అందజేశారు.